కథానిక

# ఆమెపట్ల జరిగిన అపచారం

కోటంరాజు జనార్దనరావు

సర్వ సాధారణంగా ఆచార వ్యవహారాలనుబట్టి వాతావరణాన్ని బట్టి వారి వారి జీవితక్రమాలు మారుతూంటాయి. అందులో రచయితల జీవితాలు ఒక విశిష్ట స్థానాన్ని పొందుతాయి. వారి జీవితమే ఒక ప్రత్యేకత. వారు తిరిగే వాతావరణం, సమాజం నిత్య నూతనంగానూ, మామూలుదానికి విరుద్ధంగానూ వుంటుంది. అటువంటి వినూత్న సీమలలో వారికి అనుకోని సంఘటనలు, అనుభూతులు జరుగిపోతూ వుంటాయి.

కాని మానవుడు తనకు జరిగిన సంఘటనను గాని, అనుభూతినిగాని, తన ఆప్తులకు చెప్తు కుంటూ నెమరు వేయకుండా వుండలేడు. అది అతనికి ఒకవిధమైన తృప్తి ఆనందం, కాని రచయిత ఆప్తులు ఒకరు, యిద్దరూ కాదు - తన తోటి మానవులంతా తనవారే. వారికి తన అనుభూతి తెలియపరచి ఆనందపడకుండా వుండలేడు. అందుకని వెంటనే కాగితం, కలం తీసుకుని, కలంచిందులతో తన భావాలను, వుద్దేశాలను మిగిలిన వారికి అందజేస్తాడు. అది అందరూ చదివి ఆనంద పడితే-తాను, తనజీవితం కృతకృత్య మయినట్లుగా భావిస్తాడు.

అతరగతికి చెందిన వ్యక్తే శ్రీనాధుడు. అసలు అతని చారిత్రమే వోచిత్రమయినది. ఇంకను పూర్వధ చెప్పినట్లు అతని మిత్రులూ చిత్ర విచిత్రములైన వారు. ఆ సమాజంలో అనుకోని సంఘటనలు జరుగుతూ వుంటాయి. అవి కేవలం నిత్య నూతనంగా కనపడుతాయి. వెంటనే రచయిత అయిన శ్రీనాధుడు పాఠక జనానికి ఇది అందజేస్తాడు. తృప్తిపడి తనతోడి వారితో ఆనంద పడతాడు.

—అవి శ్రీనాధుడు మంచి వయసులోవున్న రోజులు. కాలేజీలో చదువుతున్న ఆరోజులలో ఆతనికి మిత్రులు యిద్దరు మాత్రమే వుండేవారు. ఈమిత్రత్రయం ఎప్పుడూ కలసి తిరుగుతూ వుండేవారు. ఆ నగరంలో ఈ మిగ్గురిదీ ఒక ప్రత్యేక సమాజం.

కాలేజీలో చదువుతున్న కుర్రవాళ్ళు ఎవరు ఆధునికంగా ముందుకు పరుగెత్తరు? ఆ విధంగానే ఈ మిత్రత్రయం ముందుకు జీవితంలో ప్రయాణం సాగిస్తూ వుండేది. దాంతోపాటు, యుక్త వయస్సులో వుండడం వలన, వారు ప్రేమకలాపాల్లోపడ్డారు. ఆప్రవాహంలో కొట్టుకొని పోతున్నారు. ఆదర్శనీయంగా ప్రేమిస్తూ కాలం గడుపుతూవున్నారు.

కాని వారిలో శ్రీనాధునకు కాస్త వెనుక చూపు వున్నది. వారు అనుసరించిన నూతన మార్గాన్ని, ఒకసారి ముందుకు పర్యవేక్షించి చూచాడు. అర్థం అయింది. తాము నడుస్తున్న దోవ కేవలం మిధ్యాశూన్యప్రపంచానికి దారితీస్తున్నదని గుర్తించాడు. తన భ్రమను చూచి నవ్వుకున్నాడు. ఈ ఆధునిక యుగంలో ప్రతి విషయాన్ని మనం నూతనత్వంక్రింద, అభ్యుదయం క్రింద భావిస్తూంటాము. ఆవిధమైన భ్రమతోనే చాలమంది యువకులు ముందడుగు వేస్తూ వుంటారు. కాని వారివారి ఆశయాలు చివరకు అడుగంటిపోతాయి. ఆ ప్రయాణంలో భ్రమ పోయేసరికి శ్రమే మిగులుతుంది.

అటువంటి సంఘటనే వారిజీవితంలో కూడా సంభవించింది—

చదువుకున్న వాళ్ళవటం వలన, అందులో విద్యాభివృద్ధినానికి అర్రులు చాచేవారు గనుక, ఎక్కువకాలం పుస్తకపఠనంలో వాళ్ళు కాలం గడుపుతూ వుండేవారు ఆరోజుల్లో. ఆ యవ్వన దశలో వారికి నచ్చిన పుస్తకాలు—శృంగార నైషధము, శాకుంతలము, బిల్హణీయము... వగైరా వగైరా శృంగారబోధకమైన శాస్త్ర పుస్తకాలు. అందులో చదివినది వీలయినంత వరకూ ఆచరణలో పెట్టే స్వభావం వీరిది, అందు

కని ఈ విద్యాఫలితాన్ని, అనుభూతిలోనికి తెచ్చుకుందామనుకున్నారు. ముందుకు అడుగు వేశారు.

ఈ రోజుల్లో యిరువురు స్త్రీపురుషులు వొండొరులను పూర్తిగా అర్థం చేసుకోకుండానే, ఒకరినొకరు ఆదర్శంగా ప్రేమిస్తున్నా మనుకుంటారు. వారిది ఆదర్శప్రేమ అనుకుని బరువుగా నిట్టూరుస్తారు. వాస్తవానికి అది ఆదర్శప్రేమ కాదు గనుక, చివరకు విషాదాంతంగా మారుతుంది. ఆ విధంగానే వారి ఆదర్శప్రేమ ప్రయత్నాలు విషాదాంతంగా అంతమయ్యాయి.

అయితే విచారిస్తూ కూర్చోవడం భారతీయ సాంప్రదాయం కాదుగనుక, ఈ అనుకోని జీవితంలోని మలుపుకు వారు నవ్వుకున్నారు. శ్రీనాథుడు వెంటనే దానిని లిఖితపూర్వకంగా, ఆంధ్రప్రజానీకానికి తమ ఆదర్శ ప్రేమగాథను అందచేయడానికి పూనుకున్నారు.

కాని వాస్తవాన్ని చిత్రిస్తూ వ్రాసిన ఈ గాథను ప్రచురించడానికి, పత్రికాధిపతులు ఝడిసారు. తిరిగి పంపించారు. విసుగులేకుండా మన ఆంధ్రదేశంలో వున్న పత్రికలన్నిటికీ. చివరకు ధనకాంక్ష ప్రతిఫలంగా లేకుండా కూడా పంపాడు. కాని ఆ కథయొక్క పూర్వచరిత్ర పత్రికాధిపతులను ప్రసన్నులను గావింపలేక పోయింది. ఆ కథ చివరకు శ్రీనాథుని వ్రాతప్రతులలోనే ఆగిపోయింది.

* * *

ఈ అనుభూతి అమిత్రత్రయం జీవిత క్రమంలో అనుకోని మార్పులను తెచ్చింది. వారిని వ్యక్తుల్నిగా చేసింది. ఆలోచించి ముందుకుసాగే వారినిగా తయారు చేసింది. అంతే ఆ గాథ వారిని, వయస్సులో చిన్నవారయినా, అనుభూతిలోను, భావాలలోను వయోవృద్ధులనుగా చేసింది.

ఇప్పుడు వారి జీవిత రంగం మారి, నాటక రంగంమీదకు ప్రవేశించింది. విద్యార్థి దశను పూర్తిచేసుకొని, నాటక కళమీద అభిరుచివున్న వారు అవడంవలన, నాటకాలు ఆడడం ప్రారంభించారు. విద్యాధికులు, పాత్రల ఔచిత్యానౌచిత్యాలను సరిగా అర్థంచేసుకొని నటించడం వలన, వారు ఆ రంగంలో బాగా రాణించారు. అందరిచేతా గౌరవింపబడ్డారు. కొద్దికాలంలో ఆ కంపెనీ గొప్పపేరును సంపాదించుకొని, వున్నత స్థానానికి వచ్చింది.

వారి జీవిత రంగం మారడంతోటి వారి అనుభూతులుకూడా మారడం ప్రారంభించాయి. నాటకకళకు ముందడుగు వేసివచ్చే వేశ్యలతోనే కాకుండా, విద్యాధికులయిన పురుషులకు అక్కడ స్థానం దొరికింది. ఒక ముక్కలో చెప్పాలంటే ఆ కంపెనీ కేవలం విజ్ఞానం కలిగిన విద్యాధికుల కంపెనీ అయిపోయింది. వివేకం కలిగిన వారందరూ ఏకమవడంతో దాని గమనం ముందుకు వేగంగా సాగిపోతోంది.

"నాటకం" అన్న పేరుకు సార్థకంగా, అక్కడి స్త్రీ పురుషులు నటిస్తూండాలి. ఒకొక్కళ్ళు ప్రేమికులుగానూ, యింకొకళ్ళు సోదరీ సోదరులుగానూ, యింకా యింకా ఆయా సమయాలనుబట్టి పాత్రలను నిర్వహిస్తూ వుండాలి. 'వెక్కిరించినవాడి మూతే వొంకర పోతుందన్నట్టు' నటించి నటించి కాలం గడుపుతున్న వారివారి జీవితాలు, ఆ నటననే అనుకోకుండా వాస్తవంలోకి తిప్పుకుంటూ వుంటాయి. అది కేవలం వారికి తెలియకుండానే జరిగిపోతుంది. ఆ నటన వాస్తవం అయిపోవడంతో వారు నాటక రంగంమీదనే కాకుండా, వాస్తవిక జగత్తులోకూడ ఆ ప్రేమ కలాపాలను సాధిస్తూ వుంటారు. అది సహజం.

ఆ విధంగానే శ్రీనాథుని జీవితంలో కూడా ఒక స్త్రీ తనకు తెలియకుండానే, స్థానాన్ని ఆక్రమించుకుంది. ఇంతకు పూర్వం చెప్పినట్లు దానికల్లా పెద్దకారణం- 'అచల' అన్న మహిళ శ్రీనాథుడు కలిసి ప్రేమికులుగా నాలుగయిదు నాటకాలలో భూమికలు వహించడమే. ఆ నటనాప్రేమ వాస్తవం అయిపోయింది. ఆవేశ పూరితురాలయిన అచల అతనిచే బాగా ఆకర్షింపబడింది. ముందుకు అడుగు వేసింది కాని దానిని అర్థం చేసుకోలేని శ్రీనాథుడు అభిమానం క్రింద భావించి, తనలో ఆమెకు ఆ స్థానాన్ని ఇచ్చాడు.

ఈ ప్రపంచంలో రకరకాల వ్యక్తులున్నారు. కొందరు స్వయంసిద్ధులై తమపైకి దుముకుతున్న ప్రేమప్రవాహాన్ని తమంతట తామే గుర్తించుకోగలరు. కాని కొందరు, అప్రమత్తులై తమ జీవి

కాలను గడుపుతుండడం వలన యితరులు దానిని తెలియ పరిస్త్రీగాని గుర్తించరు. ఈ తరగతికి చెందిన వ్యక్తే శ్రీనాధుడు. విపక్షం నుంచి అయినప్పటికి స్వార్థం ప్రబలిపోయేటప్పటికి ఆకూటంలో ఐక్యత పోతుంది. ఇది గ్రహించిన ఆమిత్ర త్రయంలోని ప్రదీప్, శ్రీనాధుకు, అక్కడ జరుగబోతున్న విషయాన్ని తెలియ పరిచాడు. తాత్కాలిక వ్యామోహానికి లోనై, సమిష్టిని నాశనం చేయద్దని హెచ్చరించాడు.

విజ్ఞానం కలిగిన వాడవడంవలన అతన్ని అర్థంచేసుకున్నాడు శ్రీనాధుడు. వీలయినంత వరకూ తాను నిష్కల్మషంగా వుండడానికి ప్రయత్నం సాగించాడు. ఆమె చేయబోతున్న పొరపాటును తెలియపరుద్దా మనుకున్నాడు. కాని విధానం తెలియలేదు.

కాని లతకు ఆసరా లభించినప్పుడు. మొదల దానికి ఏమాత్రం అంగీకరించదు. అంచలమీద పైకి ప్రాకిపోతుంది. ఆవిధంగానే అచలాదేవి, నానాటికి ఈతనిని తీవ్రంగా ప్రేమించసాగింది. ఈతీవ్ర స్వరూపాన్ని చెందుతున్న ఆమె ప్రేమను చూచి శ్రీనాధుడు నవ్వుకున్నాడు. వారు యవ్వనంలో వున్నప్పుడు, తాను ఈమె కొరకే ఆదర్శ ప్రేమ ప్రయత్నాలుచేసి విఫలుడయినాడు. కథ వ్రాసుకున్నాడు. కాని నేడు ఆమె తన్ను గాఢంగా ప్రేమించి నిరాశచెందుతుంది. ప్రతి వ్యక్తి జీవితంలోని పూర్వాపరాలకు ఎంత వ్యత్యాసముందా అనుకున్నాడు.

ఈ ప్రణయ ప్రవాహం ఒకవైపునుంచి ప్రవహిస్తున్నప్పటికీ, యితరుల కంటబడకుండా దాగుకో లేకపోయింది. అందరికీ ఈ ప్రేమ వ్యాపారం అర్థమయింది. శ్రీనాధుడూ, అచలాదేవీ ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నట్టు వారువూహించుకున్నారు. విద్యాధికులైనయిద్దరు అవివాహితులు ప్రేమించుకుంటే దోషం లేదనుకుంది ఆసమాజం. మౌనంగా ఈ ప్రేమ ప్రవాహానికి అవాంతరం లేకుండా లాకులను తెరచింది.

ఒక ఆదర్శ రచయిత నవుదా మనుకున్న శ్రీనాధుడు, యిటు తనకు అంతులేని ప్రేమ ప్రవాహంలో మునకలు వేస్తున్నప్పటికీ, తన రచనాప్రపంచంలో తీవ్రంగా కృషి చేస్తున్నాడు. అతని కలం పూర్వంమాదిరి చిందులు వేస్తూనేవున్నది. ప్రజలనుంచి పూర్వం కన్నా అధికంగా మన్ననలను పొందుతూనేవుంది.

మళ్ళీ చాలనాళ్లకు తనలో ఈ ప్రణయపు గొడవలు మేల్కొంచడంతో, యింతకు పూర్వం వారి ఆదర్శప్రేమ ప్రయత్నాలు స్ఫురణకు వచ్చాయి. నవ్వుకున్నాడు. అప్పుడు యిప్పుడు ఒకే కథానాయిక. కాని జరుగుతున్న క్రమం వేరు. వెంటనే ఆ కథను తిరిగి ప్రచురింపచేయాలని అనుకున్నాడు. ఏ పత్రికాధిపతీ దానిని ప్రచురించలేదన్న అభిప్రాయం వున్నప్పటికీ, పంపగా మిగిలిన పత్రికకు దానిని పోస్టు చేద్దామనుకున్నాడు.

దానికి తగిన ప్రోత్సాహం యిచ్చాడు మిత్రుడు ప్రదీప్. ఇంతకపూర్వం తిరిగి వచ్చిన కాపీలు అంతులేకుండా అదృశ్యం అవడం వలన, తిరిగి కాపీ చేయవలసి వచ్చింది. దస్తూరీ బాగుండడం వలన ప్రదీప్ దానిని కాపీచేసి ఆ పత్రికకు పంపాడు. వెంటనే అది ప్రచురింపబడి, పత్రిక వచ్చి శ్రీనాధుని యింటికి చేరింది. దానిని చదివిన అతని కుటుంబం, అతని శీలాన్ని శంకించింది. తన శీలానికి తీరనిమచ్చను తెచ్చిన ఆ కథను యితరులకు చూపకుండా దాచుకున్నాడు. దానికి తగినట్టుగా ఆ పత్రిక ఆ గ్రామం రాదుకూడాను. కాబట్టి ఆ గ్రామ ప్రాంతాలలో ఆ రహస్యం బట్టబయలుకాలేదన్నమాట!

కాలం గడుచుకొస్తోంది. అచలాదేవి ప్రేమ రోజురోజుకు తీవ్రస్వరూపాన్ని పొందుతోంది. కాని అది పరిస్థితులను బట్టి ఒకవైపునుంచే సాగిరావడంవలన గమ్యస్థానం తొందరగా చేరలేకపోతోంది. పైగా ఈ ప్రయాణంలో అచలాదేవి అలసట చెందుతోంది.

ప్రేమికుల ప్రణయ ప్రయాణంలో సంఘటనలు దాదాపు ఒకేవిధంగా వుంటాయి. వారి చిన్నతనంలో జరిగిన సంఘటనను జ్ఞప్తికి వస్తున్నాయి అందరికీ. శ్రీనాధుని మిత్రుడు ప్రదీప్‌కు తను, యింతకుపూర్వపు ఆదర్శప్రేమ ప్రయత్నాలు అచలాదేవికి తెలియచేయాలన్న కోరిక గలిగింది. అందుకని ఒకనాడు ఈపత్రిక శ్రీనాధుని దగ్గర తీసుకొని, అచలాదేవికి చదవడానికి యిచ్చాడు.

ప్రియురాలి ప్రణయవ్యాపారాలను చదవడానికి మొదటిలో కొంత ఈర్ష్య కలిగినప్పటికీ, ఆ కథలోని నాయిక తాను మాత్రం కాదుకదా అన్న అనుమానం అనుకోకుండా కలిగింది. శ్రద్ధతో చదవడం ప్రారంభించింది. విజ్ఞానాన్ని వినోదాన్ని యిచ్చే ఆ కథను అచలాదేవి చదవడం చూస్తూ, రిహార్సల రూములో నిమ్మదిగా హార్మోనియం వాయించుకుంటున్నాడు శ్రీనాధుడు.

ఏకాగ్రతతో రెండు మూడు సార్లు చదివి పుస్తకాన్ని మూసివేసి మౌనంగా కూర్చుండిపోయింది. ఆమె ముఖం ఎందుకనో గంభీరంగా మారిపోయింది. ఇంతవరకు ఆకథను చదివి ఆనందించి చిరునవ్వు నవ్వేవారేగాని, యిట్లా మౌన ముద్రాలంకారులు ఎవ్వరూ కాలేదు. ఇది శ్రీనాధునకు అర్థం కాలేదు. 'ఆమెను గాయపరిచే సంఘటనలు దానిలో ఏమైనా వున్నాయా', అనుకున్నాడు. తన స్మృతిపథానికి అందినంత వరకు అటువంటి సంఘటనలను తాను చిత్రించలేదే! పైగా ఆకథ ఈమె సమాజంలోనికి రాకపూర్వము వ్రాసినదయ్యె! ఆమె గంభీరతకు తగిన సమాధానం దొరకలేదు శ్రీనాధునకు.

శ్రీనాధునకు ఒక విచిత్రమైన అలవాటుంది. ఆవేశం రావడంతోనే కలం చేతిలో పుచ్చుకొని, ఆ ఆవేశానికి అనుగుణ్యంగా చేతిని పరుగెత్తనిస్తాడు. తనకు తృప్తి కలిగిన తరువాత దానిని పత్రికకు పంపిస్తాడు అంతటితో అతని బాధ్యత తీరినదనుకుంటాడు. కొద్దో గొప్పో పేరుగణించిన అతని కథను పత్రికాధిపతులు తప్పక ప్రచురిస్తారు. పత్రిక యింటికి వస్తుంది. ఒకసారి ఆదంతంతో గాలిపీల్చుకుని, తన కథను చూసుకుని షెల్ఫులో దాచుకుంటాడు. అంతటితో ఆకథ అధ్యాయం పూర్తి అయిందనుకుంటాడు!

అతని మిత్రులు అనేక పర్యాయములు చెప్పారు—"కథ పడివచ్చిన తరువాత దానిలో ఏమైనా పొరపాటులున్నాయేమోనని గాని, లేక సంపాదకుడు స్వతంత్రించి ఏమైనా మార్పులుచేశాడా?, అనిగాని, అవి ఎంతవరకుతన భావానికి అనుగుణ్యంగా వున్నాయి అనిగాని చూచుకోమనీ, వెంటనే దాచుకో వద్దనీ", అంటుండేవారు. ప్రచురింపబడిన తరువాత ఏ మార్పులుంటేమాత్రం తాను చేయగలిగింది ఏమీ లేదుగనుక, వారి సలహాకు సమాధానంగా నవ్వి వూరుకుంటూ వుండేవాడు.

తన ఈ వింత అలవాటు ఎందుకనో శ్రీనాధునికి జ్ఞప్తికి వచ్చింది. దానికల్లా పెద్దకారణం కథ చదివి చిరునవ్వుతో తన కళ్ళలోకి చూచి అభినందించవలసిన 'అచలాదేవి' మౌనంగా తల వంచుకొని వూరుకోవడమే. దానితో తనకు తెలియని అనుమానం ప్రవేశించింది. తనలో—ఆ కథను ఎవరైనా మార్చలేదు గదా అని!

ఇప్పటికి ఆ కథను తాను తిరిగి చూద్దామనుకున్నాడు. అచలాదేవి దగ్గరకు వెళ్ళి—

"ఏదీ, ఆపుస్తకము ఒకసారి యిటులే అచలా! ఒకసారి చూచియిస్తాను అన్నాడు.

మాట్లాడలేదు అచలాదేవి. తిరిగి అడిగాడు.

"నాకు ఈ కథను దాచుకోవాలని వుంది. నేను ఈ పుస్తకము మీకు ఈయను" అంది గంభీరంగా.

అర్థంగాక తల గోకున్నాడు శ్రీనాధుడు.

"పోనీ కథ ఎట్లావున్నదో చెప్పలేదే!" అన్నాడు. అతని కళ్ళల్లో కొంటెతనం తొంగి చూస్తోంది.

"మీ మిత్రుడు వ్రాసిన కథలు ఎందుకు బాగుండవు. ఇది చాలా బాగుంది—ఇవ్వాళ నాకు రిహార్సలు చేయడానికి మనసు బాగుండలేదు. ఇంటికి వెడతాను" అని, నమస్తే! చెప్పి అకస్మాత్తుగా బయలుదేరి వెళ్ళిపోయింది.

ఇంతవరకు తన కథను చదివి అందరూ అభినందించారుగాని ఎవ్వరూ ఇంత హంగామా చేయలేదు. తనకు తగిన కారణం దొరకలేదు. మౌనంగా కూర్చున్న ప్రదీప్ వంక చూచాడు. ప్రదీప్ సమాధానం చెప్పకుండా

"మనంకూడా పోదాం పదరా!" అని బలవంతాన శ్రీనాధుని రూమునుంచి బయటకు తీసుకుని వెళ్ళాడు.

రూమునుంచి బయటకు వచ్చిన మిత్రులిద్దరూ, కాళ్ళకు స్వేచ్ఛ నిచ్చి వాటి యిచ్చవచ్చిన చోటుకు నడుస్తున్నారు. ఈ జరిగిన సంఘటన, అందుకు మూలమైన కథనుగురించే యిద్దరూ తీవ్రంగా ఆలోచిస్తూ, మౌనంగా వెడుతున్నారు.

ఈ కథ వారిని మొదటినుంచీ యిబ్బంది పెడుతూనే వుంది. ఆ కథ వ్రాయడానికి తీరని సంఘటనలు జరుగవలసి వచ్చింది. ప్రత్యేక స్థితిలో దానిని శ్రీనాధుడు రచించాడు. వాస్తవాన్ని కల్పన లేకుండా రచించడంవలన, ఎవ్వరూ దానిని ప్రచురించలేకపోయారు. చాల స్థలాలలో తిరిగి తిరిగి, రచయితదగ్గరే ఆగిపోయింది. చివరకు మిత్రుని సలహాతో దానిని పంపాడు. అది ప్రచురింపబడింది. అది చదివిన వారందరూ, ఏదో తెలియని భావోద్రేకాన్ని దాచుకుంటూ ఈకథనిని అభినందించారు ఈనాడు అచలాదేవి ఆ కథానికను చదివి గంభీరంగా విడలిపోయింది. ఆ గంభీరతలో తెలియని వేదన కనబడుతున్నది. ఈ విచిత్ర సంఘటనలు తనకు ఏమీ అవగాహన కావడం లేదు!

ఏకాకిగా సమస్యను గురించి అట్టేసేపులో ఆలోచించలేము. అలసిపోతాము. ఇతరుల సలహా కోరుతాము. ఆవిధంగానే శ్రీనాధుడు, మిత్రుడు ప్రదీప్‌ని అభిప్రాయానికై ప్రశ్నించాడు.

ప్రదీపు ఒక్క నిముషం ఆగి, సమీపంలో వున్న కృష్ణానదీతీరాన కూర్చుండబెట్టి, చెప్ప సాగాడు—

"శ్రీనాధ్! నీకు చెప్పకుండా నేను ఒక విషయాన్ని స్వతంత్రించి చేశాను. వాస్తవానికి ఈ కథ చదివి ఆమె ఆవిధంగా దూరం అయిపోవలసిన అవసరం లేదు.' దానికల్లా పెద్ద కారణం నేనే.

సరే! ఈ కథ ఆమె మన సమాజంలోకి రానిపూర్వం వ్రాసినది కదా! నేను యిప్పుడు దానిని తిరిగి కాపీ చేస్తూండగా ఒక సందేహం కలిగింది. దానికి సమాధానం కొరకు ఈ పనిని చేశాను—"గాఢతమంగా ప్రేమిస్తున్న స్త్రీకి, తన ప్రియుడు తన్ను సోదరిగా భావిస్తున్నట్లు తెలిస్తే ఆమె భావపరంపర ఏవిధంగా మారుతుంది:" అన్న సమస్య నాలో ప్రవేశించింది. సరే! అచలాదేవి నిన్ను ప్రేమిస్తున్నది కదా, ఈ ప్రశ్నను ఆమెమీద వేసిచూస్తే ప్రత్యక్షంగా సమాధానం లభిస్తుంది కదా అని వెంటనే, నువ్వు చెల్లెలంటూ వ్రాసినచోట, అచలాదేవి పేరు యిరికించాను. నువ్వన్నట్లు ఈకథ అన్నికాలాలకు పనికివస్తుంది. అందుకని ఈ కథ చదివిన ఆమె, తన్ను నువ్వు సోదరిగా భావిస్తున్నట్లుగా అభిప్రాయ పడింది. ఇంతవరకు నీ నుంచి తగిన సమాధానం లేకపోవడం వలన దానిని నీ అభిప్రాయంక్రింద, సమాధానంక్రింద చేసుకుంది. దానితో ఆమెహృదయంగాయపడింది. నిలబడలేక వెళ్ళిపోయింది—

అనుకోని ఈ చిన్న మార్పుతో నేను ఒక జీవిహృదయానికి తీరని గాయాన్ని కలిగించాను. క్షమించు" అని అస్తమిస్తున్న సూర్యుని క్షీణ కాంతులలో, నదీ కెరటాలవంక చూస్తూ ఆగిపోయాడు ప్రదీప్.

ఈ విషయం తెలిసేటప్పటికి, శ్రీనాధునకు అచలాదేవి ప్రేమస్వరూపం విశదంగా అర్థం అయింది. ఆమెకు తనపై గల అభిమాన యథార్థ స్వరూపాన్ని ప్రత్యక్షంగా చూడగలిగాడు. అయితే తన మిత్రుడు, ఒక్క అచలాదేవినే కాదు గాయపరచింది, యిటు తనను ఒక పాషండుడుగా కూడ నిరూపించి వదలివేశాడు. కథలను తిరిగి సరిచూచుకునే అలవాటులేని తన స్వభావాన్ని నిందించుకున్నాడు. చాల బాధ పడ్డాడు శ్రీనాధుడు. తెలియక పొరపాటు చేసిన తన మిత్రుని తానేమీ అనలేదు.

"మరి తన హృదయాన్ని గాయపరచిన ఆ కథను దాచుకుంటూ సన్నది "ఎందుకా?" అన్న సమస్య ఎదురైంది, శ్రీనాధునకు. ఎవరైనా కాలిలో గుచ్చుకున్న ముల్లును భద్రంగా దాచుకో ప్రయత్నిస్తారా? మిత్రుణ్ణి తిరిగి ప్రశ్నించాడు.

ప్రదీప్ వేదనతో నవ్వి—

"పిచ్చివాడా! ఆ 'కథానిక' ఆమె భగ్న ప్రేమకు గుర్తుగా!" అన్నాడు.

అబ్బ! 'ఆ కథానికకు పూర్వాపరాలలో ఎంత ఇతిహాసముంది. అనుభవమూ వున్నాయా' అనుకొని బరువుగా నిట్టూర్చాడు శ్రీనాధుడు. మరి ఆమెకు జరిగిన పొరపాటును తెలియజేయడము ఎలా?